క్లుప్తంగా

పారిశుద్ధ్య పనుల పరిశీలన



ముసునూరు: గ్రామాల్లో చెత్త తొలగింపు పనులను నిరంతరం బాధ్యతగా చేయించాలని జిల్లా పరిషత్ సీఈఓ శ్రీహరి సూచించారు. వేల్పుచర్లలో పరిసరాల శుభ్రతను మంగళవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా చెత్త శుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేశారు. గ్రామాల్లో పరిశుభ్రత కోసం చేపట్టే కార్యక్రమాలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమాల్లో ఎంపీడీఓ బీపీ సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు, అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

82 మందికి కంటి వైద్య పరీక్షలు



విస్సన్నపేట: మండలంలోని పుట్రేల గ్రామంలో భగవాన్ సత్యసాయిసేవా ట్రస్ట్ ఆద్వర్యంలో మంగళవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ సచివాలయం వద్ద తుసూరి జయరాజు ఇంటి ఆవరణలో నూజివీడు గిఫర్డు మెమోరియల్ హాస్పటల్ కంటి వైద్యులు 82 మంది రోగులను పరిశీలించారు. వీరిలో 38 మందికి శుక్లాలు ఉన్నట్లు గుర్తించారని వారికి ఉచితంగా కంటి ఆపరేషన్లు నిర్వహిస్తామని భగవాన్ సత్యసాయి సేవా ట్రస్ట్ అధ్యక్షుడు జగ్గవరపు రంగారెడ్డి తెలిపారు. కార్యక్రమంలో సేవా ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.

లైన్‌మాన్ శ్రీనివాసరావుకు సన్మానం



మైలవరం: ఉత్తమ లైన్‌మాన్ అవార్డు గ్రహీత దర్శి శ్రీనివాసరావును మంగళవారం సన్మానించారు. గణపవరంలోని కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఏఈ రామ్మోహనరావు మాట్లాడుతూ ప్రతి ఏడాది స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం అందించే ప్రతిష్టాత్మకమైన ఉత్తమ సేవా పురస్కారాన్ని విద్యుత్ శాఖ, జిల్లా ఉన్నతాధికారుల చేతుల మీదుగా అందుకోవడం తమకు ఎంతో ఆనందంగా ఉందన్నారు. గణపవరం సెక్షన్ వెల్వడం లైన్ మాన్ శ్రీనివాసరావు వృత్తి పట్ల ఎంతో నిబద్ధతో పనిచేసేవాడన్నారు కార్యక్రమంలో లైన్ మాన్‌లు జె.అనిల్‌కుమార్, శివరాం, నరేష్, సుందర్ సింగ్, సిబ్బంది పాల్గొన్నారు.

సుందరయ్య కరకట్ట గండ్లు పూడ్చాలి



ఇబ్రహీంపట్నం: అధిక వర్షాలకు ఖాజీమాన్యం సుందరయ్య కరకట్టకు పడిన గండ్లు తక్షణం పూడ్చాలని సీపీఎం మండల కార్యదర్శి ఎం.మహేష్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరకట్టకు పడిన గండ్లను మంగళవారం ఆయన పరిశీలించారు. గత వారం రోజులుగా కురుస్తున్న వర్షాలు కారణంగా గండ్లు పడటంతో ప్రజలు తీవ్ర భయాందోళనలో ఉన్నారన్నారు. ఇప్పటికే కరకట్ట గండ్లతో సమీపంలో ఉన్న నివాస గృహాలు కూలిపోయే పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. అధికారులు స్పందించి గండ్లు పూడ్చేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒకరోజు వ్యవధిలో గండ్లు పూడ్చాలని లేని పక్షంలో ఖాజీమాన్యం, సుందరయ్య కరకట్ట ప్రజల భాగస్వామ్యంతో ఆందోళన నిర్వహిస్తామని పేర్కొన్నారు.

బ్యాంకు రుణాల పేరుతో టోకరా

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): బ్యాంకు నుంచి రుణాలు ఇప్పిస్తామని చెప్పి మహిళలను మోసం చేసిన ఘటన గొల్లపూడి గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... గొల్లపూడికి చెందిన బండారి జయ పండ్లు అమ్ముకొని జీవనం సాగిస్తోంది. ఆమెకు గుంటూరు జిల్లా పిరంగిపురం మండలం 113 తాళ్లూరుకు చెందిన ఓరుగంటి చంద్రలేఖ పరిచయమైంది. తాను ధనలక్ష్మీ ఫైనాన్స్ బ్యాంక్ నుంచి రుణాలు ఇప్పిస్తానని నమ్మబలికింది. రూ. 5వేలు ముందుగా చెల్లిస్తే ఒక్కొక్కరికి రూ. 3లక్షల వరకు లోను ఇప్పిస్తానని నమ్మించింది. ఆమె మాటలు నమ్మి బండారి జయ రూ. 5వేలు ఇవ్వడంతో పాటు మరికొంత మందిని పరిచయం చేసింది. వారు ఒక్కొక్కరు రూ. 5వేల చొప్పున ఇచ్చారు. ఆ తర్వాత లోను గురించి అడగ్గా చంద్రలేఖ వారిని బెదిరించడం ప్రారంభించింది. దీంతో తాను మోసపోయానని తెలుసుకున్న బండారి జయ భవానీపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రబలుతున్న విషజ్వరాలు

- గ్రామాల్లో పారిశుద్ధ్య లేమితో జనం ఇబ్బందులు
- తిరువూరులో మురుగునీటి సమస్యతో సతమతం
- మొక్కుబడిగా ఆరోగ్యశాఖ ఫీవర్ సర్వేలు



ఆంజనేయపురంలో తాత్కాలికంగా మురుగుకాలువలు తవ్విస్తున్న సర్పంచ్ కుటుంబరావు



తిరువూరు పట్టణంలో నివాసగృహాల నడుమ ఖాళీ స్థలాల్లో నిలిచిపోయిన వర్షపునీరు తొలగింపునకు సిబ్బందికి సూచనలిస్తున్న కమిషనర్ మనోజ

తిరువూరు: డివిజన్లోని పలు గ్రామాల్లో విష జ్వరాలు ప్రబలుతున్నాయి. తిరువూరు నగర పంచాయతీలో మురుగునీటి పారుదలకు సరైన డ్రెయినేజీ వ్యవస్థ లేకపోవడంతో లోతట్టు ప్రాంతాల్లోని నివాస గృహాల్లోకి వర్షపు నీరు చేరి రోజుల తరబడి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఏకొండూరు మండలంలోని పలు గ్రామాల్లో విషజ్వరాల బారిన పడిన జనం ఇళ్ల వద్దే చికిత్స పొందుతున్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏకొండూరు మండలంలోని పలు గ్రామాల్లో జ్వరపీడితుల సర్వే జరిగినప్పటికీ విషజ్వరాల ప్రభావాన్ని గుర్తించలేదని ఆ మండల ప్రజాప్రతినిధులు వాపోతున్నారు.

హడావుడిగా కచ్చా డ్రెయిన్ల తవ్వకం....

గ్రామాల్లో వర్షాకాలానికి ముందుగానే డ్రెయిన్ల తవ్వకం చేయకపోడంతో భారీవర్షాల కారణంగా ఎస్సీ కాలనీలు, శివారు గ్రామాల్లో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. తిరువూరు మండలంలోని కోకిలంపాడు, మునుకుళ్ళ, చింతలపాడు, ఏకొండూరు మండలంలోని రేపూడి తండా, మాధవరం, చీమలపాడు, కేశ్యా తండా, గ్యామా తండా, కృష్ణారావుపాలెంతో పాటు పలు తండాల్లో పారిశుద్ధ్య లేమితో దోమలు విజృంభిస్తున్నాయి. అంతర్గత రహదారులకు ఇరువైపులా మురుగునీటి పారుదలకు, వర్షపు నీరు పోయేందుకు సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో ఇళ్ల ముందే నీరు రోజుల తరబడి నిలిచిపోతోందని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. గ్రామ పంచాయతీలకు ఆర్థిక పరిపుష్టి లేకపోవడంతో పారిశుద్ధ్య పనులు చేయించలేకపోతున్నారు.

వైద్యం అందించాలని వినతి....

ఏకొండూరు మండలంలో విషజ్వరాలు ప్రబలుతుండటంతో ఇటీవల జిల్లా వైద్యారోగ్య శాఖాధికారి సుహాసిని ఆధ్వర్యంలో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. గ్రామాల్లో ఇంటింటి సర్వే నిర్వహించి జ్వరాల ప్రభావం అంతగా లేదని ప్రకటించారు. జ్వరపీడితుల సంఖ్య పెరుగుతున్నందున అత్యవసర వైద్యసేవలందించాలని పలువురు కోరుతున్నారు. కొందరు ప్రైవేటు వైద్యులు గ్రామాల్లో సాధారణ జ్వరాలకు సైతం డెంగ్యూ లక్షణాలున్నాయని, ప్లేట్‌లెట్లు తగ్గాయని చెబుతూ జ్వరపీడితులను విజయవాడకు తరలిస్తుండటంతో పేద రోగులు ఆర్థికంగా నష్టపోతున్నారు.



ఏకొండూరు మండలం రేపూడి తండాలో ఇంటివద్దే చికిత్స పొందుతున్న జ్వరపీడితులు

పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలి

వర్షాలు కురుస్తున్నందున నివాసగృహాల పరిసరాలను ప్రజలు శుభ్రంగా ఉంచుకోవాలి. వృద్ధులు, చిన్నపిల్లలు కాచి వడబోసిన నీరు తాగాలి. ఖాళీ ప్రదేశాల్లో నీరు నిలవకుండా స్థల యజమానులు జాగ్రత్తలు తీసుకోవాలి. చెత్తాచెదారాన్ని రోడ్లపై పారబోయకుండా పారిశుధ్య సిబ్బంది వచ్చినపుడు అప్పగించాలి.

– మనోజ, కమిషనర్, తిరువూరు నగర పంచాయతీ

మత్తు పదార్థాలకు బానిసలు కావొద్దు



కార్యక్రమంలో మాట్లాడుతున్న పట్టణ సీఐ పి.సత్యశ్రీనివాస్

నూజివీడు: యువత మత్తు పదార్థాలకు బానిసల వ్వొద్దని, చదువుపై దృష్టి సారించి జీవితంలో ఉన్నత స్థానాలకు ఎదగాలని పట్టణ సీఐ పి.సత్యశ్రీనివాస్ తెలిపారు. నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో పట్టణంలోని సెయింట్ థామస్ హైస్కూల్‌లో మత్తు పదార్థాలు, సోషల్ మీడియా దుర్వినియోగంపై మంగళవారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న సీఐ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో యువత పెడదారి పడుతోందని, లక్ష్యసాధనకు కాకుండా మత్తు పదార్థాలు, సోషల్ మీడియాకు బానిసలుగా మారుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. దీనివల్ల తన జీవితాన్ని నాశనం చేసుకోవడమే కాకుండా సమాజానికి కూడా ఎంతో నష్టం వాటిల్లుతుందని చెప్పారు. విద్యార్థులు దురలవాట్ల జోలికి వెళ్లకుండా చదువుపై దృష్టి సారించి తల్లిదండ్రుల ఆశలను నెరవేర్చాలన్నారు. సైక్రియాటిక్ వైద్యులు సుధీర్ మాట్లాడుతూ శరీరంలో ప్రతి అవయవం పాడుకావడానికి మత్తు పదార్థాలు కారణమన్నారు. నవజీవన్ బాలభవన్ ప్రోగ్రాం మేనేజర్ జక్కుల ఆంజనేయులు మాట్లాడుతూ పిల్లలు, పెద్దలు ఎవరైనా ఈ మత్తు పదార్థాలకు బానిసలుగా మారినా అలాంటి వారికి నవజీవన్ బాలభవన్ ఆధ్వర్యంలో డీ అడిక్షన్ సెంటర్‌లో కౌన్సెలింగ్ ఇస్తామన్నారు. ఫోన్ నెంబరు 94904 92020లో సంప్రదించాలన్నారు.

అప్రోచ్‌రోడ్డు లేక రైతుల అవస్థలు



పులివాగుపై ఉన్న చప్టాకి ఒక వైపు వరద ప్రవాహానికి కొట్టుకుపోయిన అప్రోచ్‌రోడ్డు

జి.కొండూరు: చెర్వుమాధవరం గ్రామానికి ఆనుకొని ఉన్న పులివాగుపై నిర్మించిన లోలెవెల్ చప్టాకు ఒక వైపు అప్రోచ్‌రోడ్డు ఇటీవల వచ్చిన వరదలకు కొట్టుకుపోయింది. దీంతో గ్రామానికి చెందిన రైతులు నరకయాతన పడుతున్నారు. పులివాగుకు ఒక వైపున చెర్వుమాధవరం గ్రామం ఉండగా మరో వైపు గ్రామానికి చెందిన వందల ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. అయితే కొన్ని దశాబ్దాలుగా వరదల సమయంలో పులివాగులో నుంచి వ్యవసాయ భూముల్లోకి రాకపోకలు సాగించేందుకు రైతులు ఇబ్బంది పడుతున్న క్రమంలో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.25లక్షలతో ఇక్కడ లోలెవెల్ చప్టాను నిర్మించింది. అయితే ఇప్పుడు ఈ చప్టాకు ఒక వైపు అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో రైతులకు మరలా కష్టాలు మొదలయ్యాయి. అధికారులు వెంటనే స్పందించి అప్రోచ్‌ను నిర్మించకపోతే రాకపోకలకు ఇబ్బంది తలెత్తి వ్యవసాయ పనులు నిలిచిపోతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

కృష్ణానదికి భారీగా చేరిన వరద ప్రవాహం



ఇబ్రహీంపట్నం ఫెర్రీ వద్ద ఘాట్ మెట్లు మునిగి ప్లాట్‌ఫారమ్‌పైకి చేరిన వరద ప్రవాహం



వరద పరిస్థితిపై రెవెన్యూ, ఎన్డీఆర్ఎఫ్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న దృశ్యం

ఇబ్రహీంపట్నం: అల్పపీడన ద్రోణి ప్రభావంతో కురుస్తున్న అధిక వర్షాలతో ఎగువ ప్రాంతాల్లోని జలాశయాలను నుంచి దిగువకు విడుదలవుతున్న నీటితో కృష్ణా నదిలో భారీగా వరదనీటి ప్రవాహం కొనసాగుతుంది. పవిత్ర సంగమం, ఫెర్రీ లాంచీ రేవు వద్ద స్నాన ఘాట్ మెట్లన్నీ మునిగి ప్లాట్‌పాం పైకి వరద నీరు చేరింది. లంక గ్రామాల ప్రజలకు వారం రోజులుగా రాకపోకలు నిలిచాయి. చినలంక పెదలంక గ్రామాల ప్రజలు అత్యవసర పనులపై పడవలను ఆశ్రయించి ఇబ్రహీంపట్నం చేరుతున్నారు. తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు ఫెర్రీ ఘాట్‌తో పాటు నదీతీర ప్రాంత గ్రామాల్లో పర్యటించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రస్తుతం 4.33 లక్షల క్యూసెక్కుల వరద ప్రవాహం కొనసాగుతుందని, ఇది 6 లక్షల క్యూసెక్కులకు చేరుకునే అవకాశం ఉందన్నారు. నదీతీర ప్రాంతవాసులు, లోతట్టు ప్రాంత ప్రజలు పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందాలని తెలిపారు. ఇబ్రహీంపట్నం ట్రక్ టెర్మినల్, ఏ కాలనీ ఆడిటోరియం, మూలపాడు జెడ్పీ హైస్కూల్, కాచవరం కమ్యూనిటీ హాల్, కొండపల్లి జెడ్పీ బాయ్స్ హైస్కూల్‌లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశబూమని తహసీల్దార్ వెంకటేశ్వర్లు తెలిపారు.

రహదారి నిర్మించాలని ఆందోళన



ఆందోళన చేస్తున్న వెల్వడం, గణపవరం గ్రామస్తులు

మైలవరం: మైలవరం నుంచి వెల్వడం, చంద్రాల మీదుగా నూజివీడు వెళ్ళే ఆర్ అండ్ బీ రహదారి గుంతలమయంగా మారి వాహనచోదకులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు పీవీ ఆంజనేయులు తెలిపారు. రోడ్డు సమస్య పరిష్కరించాలని, తక్షణమే రోడ్డు నిర్మాణం చేపట్టాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక ఆర్‌అండ్ బీ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు ఆంజనేయులు మాట్లాడుతూ గత ఆరు నెలలుగా ఆర్ అండ్ బీ అధికారులు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని తెలిపారు. ఇది దుర్మార్గమని అన్నారు. అనేక పర్యాయాలు సీపీఎం ఆధ్వర్యంలో నిరసన చేపట్టినా అధికారులు నిర్లక్ష్యం వీడకపోవడం దురదృష్టకరమని పేర్కొన్నారు. ఆందోళన చేసే వారిపై కేసులు పెట్టడమే తప్ప సమస్య పరిష్కారం లేదన్నారు. రోడ్డు నిర్మాణం చేపట్టకపోతే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఆర్‌అండ్ బీ ఈఈ ఎం. రోజాకుమారి, డీఈ ఆర్.అప్పారావు ధర్నా వద్దకు వచ్చి రెండు రోజుల్లో పూర్తి మరమ్మతులు నిర్వహిస్తామని పేర్కొన్నారు. వచ్చే నెల 3వ తేదీ నాటికి టెండర్ ప్రక్రియ పూర్తి చేస్తామని హామీనివ్వడంతో ధర్నా విరమించారు. కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్, ఎస్ ఇసాక్, ఎస్. విజయ్, ఆర్, సుబ్బారావు, ఎల్. వెంకటేశ్వరరావు, అనిల్ కుమార్ ఆటో కార్మికులు, వెల్వడం, గణపవరం గ్రామస్తులు పాల్గొన్నారు.

నేడు హుండీ లెక్కింపు

మైలవరం: మండలంలోని బొర్రగూడెంలో వేంచేసియున్న శ్రీతిరుపతమ్మ గోపయ్య స్వామివార్ల దేవస్థానం హుండీలోని కానుకలు బుధవారం లెక్కిస్తామని ఆలయ కార్య నిర్వాహణాధికారి ఎం.తేజ తెలిపారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త, చైర్మన్ చెలికాని వెంకట సత్య వరప్రసాద్, దేవదాయ ధర్మాదాయ శాఖ, రెవెన్యూ, పోలీస్ అధికారుల పర్యవేక్షణలో భక్తులు, గ్రామస్తుల సమక్షంలో లెక్కింపు చేపడతామని పేర్కొన్నారు.

మానవతా విలువలు పాటించాలి

తిరువూరు: విద్యార్థులు మానవతా విలువలకు ప్రాధాన్యమివ్వాలని, ఆపదలో ఉన్నవారిని ఆదుకోవాలని తిరువూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ సుశీలరావు సూచించారు. శ్రీవాహినీ ఇంజినీరింగ్ కళాశాలలో మంగళవారం ప్రపంచ మానవతా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. నేటి పోటీ ప్రపంచంలో ప్రతి ఒక్కరూ ముందుకు వెళ్లే ప్రయత్నంలో ఇతరులను గురించి పట్టించుకునే తీరిక ఉండట్లేదని పేర్కొన్నారు. ముఖ్యంగా వృద్ధులు, నిరుపేదలు, దివ్యాంగులు, చిన్నపిల్లల పట్ల మానవతా దృక్పథంతో వ్యవహరించాల్సిన కనీస ధర్మం ప్రతి పౌరుడిపై ఉందన్నారు. వాహినీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు, కరస్పాండెంట్ పోట్రు నాగేశ్వరరావు, చైర్మన్ పసుమర్తి వెంకటేశ్వరరావు, విభాగాధిపతి మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా కోదండ రామాలయ వార్షికోత్సవం



ముసునూరు: చెక్కపల్లి దివాణం సెంటర్‌లోని కోదండ రామాలయం రెండో వార్షికోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీ హనుమత్ సమేత సీతా, లక్ష్మణ, కోదండ రామస్వామికి భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం రెండు వేల మంది భక్తులకు అన్న సంతర్పణ నిర్వహించారు.

సి గుడిపాడులో దోమల నివారణ చర్యలు

చాట్రాయి: మండలంలోని సి గుడిపాడు గ్రామంలో మంగళవారం గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో దోమల నివారణకు ఫాగింగ్ చేశారు. ఈ సందర్భంగా అన్ని కాలనీల్లోని గృహాల్లో రోడ్ల పక్కన ఫాగింగ్ చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ విస్సంపల్లి ప్రశాంతి, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వరిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన



పుట్రేల (విస్సన్నపేట): గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. వరి పంటలను అధికారులు పరిశీలించి రైతులకు తగిన సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ కె.లక్ష్మీకళ్యాణి, మండల ఉద్యానశాఖ అధికారి నరేంద్ర కుమార్, ఆర్ఐ సుజాత, వ్యవసాయశాఖ అధికారులు రైతులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే పొలం పిలుస్తుంది

జూపూడి(ఇబ్రహీంపట్నం): రైతుల వ్యవసాయ సమస్యలు పరిష్కారానికే పొలం పిలుస్తుంది కార్యక్రమం వారానికి రెండు రోజులు నిర్వహిస్తున్నట్లు జిల్లా వ్యవసాయ శిక్షణా సంస్థ అసిస్టెంట్ డైరెక్టర్ మోనీషా తెలిపారు. జూపూడి, కిలేశపురం గ్రామాల్లో మంగళవారం జరిగిన పొలం పిలుస్తుంది కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. వరి పొలాల్లో ఎరువులు, కలుపు యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. నీటి ముంపునకు గురైన పొలాల్లో తక్షణం నీటిని బయటకు పంపాలని సూచించారు. మైలవరం వ్యవసాయ శాఖ ఏడీఏ శ్రీనివాసరావు, మండల ఏఓ రజని, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవం



చాట్రాయి: మండలంలోని చాట్రాయి గ్రామంలో ప్రపంచ ఫొటోగ్రాఫర్ల దినోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం సీనియర్ ఫొటోగ్రాఫర్ షణ్ముఖంను శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో మండల ఫొటోగ్రాఫర్ల అధ్యక్షుడు నవరం రామారావు, కార్యదర్శి రెబ్బు సుమన్ తదితరులు పాల్గొన్నారు.

మహాధర్నా వాల్‌పోస్టర్ ఆవిష్కరణ



మహాధర్నా వాలోపోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

నూజివీడు: డీఎస్సీ 2003 ఉపాధ్యాయులకు, అర్హులైన ఉద్యోగులకు మెమో 57 ప్రకారం పాత పింఛన్ విధానం అమలు చేయాలని కోరుతూ ఈనెల 25న విజయవాడలో నిర్వహించే మహా ధర్నా వాల్‌పోస్టర్‌ను మంగళవారం నూజివీడులో ఉపాధ్యాయులు ఆవిష్కరించారు. డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరం ఆధ్వర్యంలో పట్టణంలోని ఎస్ఆర్ఆర్ హైస్కూల్ ఆవరణలో పలు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో నాయకులు మాట్లాడుతూ డీఎస్సీ 2003లో ఎంపికై ప్రభుత్వ పాలనాపరమైన విధానాల కారణంగా పోస్టింగ్ ఆలస్యమైన ఉపాధ్యాయులకు, ఇతర ప్రభుత్వశాఖల ఉద్యోగులకు పాత పింఛను విధానం వర్తింప చేయాలన్నారు. ఈ విషయమై ప్రభుత్వానికి పలుమార్లు విజ్ఞప్తి చేసినప్పటికీ స్పందించకపోవడంతో తప్పనిసరి పరిస్థితుల్లో ధర్నా కార్యక్రమం చేపట్టామన్నారు. ఈ మేరకు ఉమ్మడి కృష్ణా జిల్లాలోని అన్ని సంఘాల ఉద్యోగ, ఉపాధ్యాయులు విధిగా హాజరై ధర్నాను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డీఎస్సీ 2003 ఉపాధ్యాయుల ఫోరం జిల్లా కన్వీనర్ బొల్లిగర్ల శ్రీనివాసరావు, యూటీఎఫ్ నాయకులు ఎ.వెంకటేశ్వరరావు, బాబురావు, పద్మకిషోర్, రాంబాబు, డీపీఆర్‌టీయూ నాయకులు వీఎస్సార్ ప్రసాద్, జి.నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, డీటీఎఫ్ నాయకులు ఎస్‌వీ శ్రీనివాసరావు, బి.వెంకటేశ్వరరావు, ఎస్టీయూ నాయకులు రాజేంద్రప్రసాద్, ఎం.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం



సమీక్షా సమావేశంలో సబ్ కలెక్టర్ వినూత్న

ముసునూరు: ప్రజా సమస్యల పరిష్కారానికే అధిక ప్రాధాన్యతనిచ్చి, ప్రజలకు జవాబుదారీగా పనిచేయాలని నూజివీడు సబ్ కలెక్టర్ వినూత్న అధికారులను ఆదేశించారు. ముసునూరులో మంగళవారం అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కార సరళిపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అభివృద్ధి కార్యక్రమాల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంలో అలసత్వం ప్రదర్శించరాదని అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బీపీ సత్యనారాయణ, తహసీల్దార్ డి.ప్రశాంతి, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

వృద్ధాశ్రమాలకు యాచకుల తరలింపు

ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ, ఇబ్రహీంపట్నం మండలం పరిధిలో యాచక వృత్తి నిర్వహిస్తున్న వారిని స్థానిక పోలీసులు గుర్తించి వృద్ధాశ్రమాలకు తరలించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఎస్ఐ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గ్రామాల్లో, పట్టణాల్లో, వీధుల్లో యాచకత్వం చేస్తూ మతిస్థిమితం లేని వారిని ప్రత్యేక వాహనంలో వృద్ధాశ్రమాలకు తరలించామన్నారు. వీరు తరచూ రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని తెలిపారు. యాచకత్వం చేసే సమయంలో రోడ్లు దాటుతూ ప్రమాదాలు జరిగి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే పలు ప్రాంతాలు, నగరాల్లో యాచకులను ప్రత్యేకమైన ఆశ్రమాలకు తరలించాలని ఆదేశాలు ఉన్నాయన్నారు. ఈ క్రమంలో 10 మందిని ఆశ్రమాలకు తరలించామన్నారు. నెల రోజుల క్రితం మరో పది మందిని తరలించామన్నారు.

ఉద్యోగులకు ప్రశంసాపత్రాలు

తిరువూరు: స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా డివిజన్లోని పలువురు ప్రభుత్వోద్యోగులకు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశా ప్రశంసాపత్రాలను అందజేశారు. గంపలగూడెం మండలం ఊటుకూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్ర ఆరోగ్య విస్తరణాధికారి వడ్డెబోయిన శ్రీనివాసరావు, మల్లేల గ్రామ పశువైద్య శాల లైవ్ స్టాక్ అధికారి మిరియాల గోపాలకృష్ణ, తిరువూరు ఏపీఎస్సార్టీసీ డిపో మేనేజరు సుబ్రహ్మణ్యం, తిరువూరు పోలీసుస్టేషన్ కానిస్టేబుల్ బాషా, తిరువూరు తహసీల్దారు కార్యాలయ రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ మరకాల వెంకటేశ్వరరావు ప్రశంసాపత్రాలు అందుకున్నట్లు సంబంధిత కార్యాలయాల అధికారులు మంగళవారం తెలిపారు.

త్రిసభ్య కమిటీ బాధ్యతలు స్వీకరణ

మైలవరం: చంద్రగూడెం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్‌గా మోర్ల వెంకట రోశాలు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. కమిటీ సభ్యులుగా తిరుపతిరావు, నాగరాజు బాధ్యతలు స్వీకరించారు. మైలవరం ఎమ్మెల్యే కమిటీ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేస్తూ రైతులకు రాజకీయాలకు అతీతంగా సేవలు చేయాలన్నారు. అదే విధంగా పుల్లూరు పీఏసీఎస్ త్రి సభ్య కమిటీ చైర్మన్‌గా వజ్రాల సురేష్‌రెడ్డి, సభ్యులు యువెంకట నారాయణ, వైవీ శ్రీనివాసరావులు ప్రమాణ స్వీకారం చేశారు.

మైలవరం: రెడ్డిగూడెం మండలం రుద్రవరం గ్రామం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మాదల సాంబయ్య, కమిటీ సభ్యులుగా ఎం.రామారావు, పి. సత్యంబాబు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు.